క్లుప్తంగా

మాకవరపాలెం తహసీల్దార్‌గా వెంకటరమణ



మాకవరపాలెం: మండల తహసీల్దార్‌గా బి.వెంకటరమణ నియమితులయ్యారు. ఇప్పటి వరకు నర్సీపట్నం తహసీల్దార్ రామారావు ఇన్‌చార్జ్‌గా కొనసాగారు. తాజాగా రావికమతంలో పనిచేస్తున్న వెంకటమణను ఇక్కడికి బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న డిప్యూటీ తహసీల్దార్ కె.నూకరాజును ఇక్కడే పూర్తి స్థాయిలో నియమించారు. కొత్త తహసీల్దార్ వెంకటరమణ త్వరలో విధుల్లో చేరనున్నారు.

చోడవరం ఈవో శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ




చోడవరం : మేజర్ పంచాయతీ చోడవరం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(కార్యదర్శి)గా శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. తుమ్మపాల ఈవోగా పని చేసిన ఈయన్ని చోడవరానికి బదిలీ చేశారు. గ్రేడ్ వన్ పంచాయతీ కావడంతో గ్రేడ్ వన్ కేటగిరీకి చెందిన శ్రీనివాసరావును చోడవరానికి బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేసిన నారాయణరావును తన సొంత పంచాయతీకి పంపించారు. పంచాయతీలో ప్రధానంగా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని శ్రీనివాసరావు తెలిపారు.

20న మండల సర్వసభ్య సమావేశం

నాతవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ఉషశ్రీ తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు విధిగా రావాలన్నారు. గత సమావేశంలో సభ్యులు అడిగిన సమస్యలకు సంబంధించి పూర్తి సమాచారంతో మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

కె.జె.పురం గ్రంథాలయం తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజ్

మాడుగుల రూరల్: గ్రంథాలయాల సమయపాలన పాటించి, పాఠకుల సంఖ్య పెంపునకు కృషి చేయాలని విశాఖ ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజ్ కోరారు.కె.జె.పురం శాఖా గ్రంథాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారి కోసం పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతున్నామన్నారు. గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ అటెండర్ వి.శృతి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


మిల్క్ సొసైటీల సిబ్బంది ఆందోళన

చోడవరం: కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ విశాఖ డెయిరీ పరిధిలో పని చేస్తున్న పాల ఉత్పత్తిదారుల సహకారం సంఘాల వేతన కార్యదర్శులు, హెల్పర్లు ఆందోళన చేశారు. చోడవరం పట్టణంలో ర్యాలీ చేసి తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం అమలు చేయాలని, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని, టైమ్ లిమిట్‌తో కూడిన ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వీరి ఆందోళనకు ఏఐటీయూసీ మద్దతు పలికింది. యూనియన్ ప్రతినిధి రెడ్డిపల్లి అప్పలరాజు, సంఘం నాయకులు గంగుపాము కనకారావు, దాడి రామారావు, బొడ్డేడ ప్రసాదరావు, నాయుడు, పాల్గొన్నారు.

నత్తనడకన వడ్డాది-తాటిపర్తి రోడ్డు పనులు

మాడుగుల: వడ్డాది నుంచి తాటిపర్తి వరకు చేపట్టిన రోడ్డు పనులు నత్తనడక సాగుతున్నాయి. గత ఆరు నెలల కిందట ప్రారంభమైన ఈ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో పాడేరు, అరకు, మాడుగుల మండలాలకు చెందిన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పనులు జరుగుతుండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో తలెత్తుతోంది. అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దేవరాపల్లి హైస్కూల్ హెచ్‌ఎంగా ఉమ



దేవరాపల్లి: దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా సిహెచ్.ఉమ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ హెచ్‌ఎంగా పని చేసిన బి.పడాల్‌దాస్ తాజంగి బదిలీ కావడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. విశాఖపట్నం నుంచి ఆమె బదిలీపై దేవరాపల్లి వచ్చారు. స్థానిక హైస్కూల్ విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.



ఏలేరు కాలువ గట్టు వద్ద మట్టి తవ్వకాలు



రాత్రి వేళలో పొక్లెయిన్‌తో తవ్వకాలు చేపట్టిన దృశ్యం

కాసులు కురిపిస్తున్న గ్రావెల్ దందా.!

- కూటమి నేతల కనుసన్నల్లో మట్టి అక్రమ తరలింపు
- రాత్రి వేళల్లో పొక్లెయిన్‌తో యథేచ్ఛగా తవ్వకాలు
- ఏలేరు కాలువ గట్టు మట్టి నాణ్యత కావడంతో డిమాండ్
- నర్సీపట్నంతో పాటు పక్క మండలాలకు అక్రమ రవాణా

నాతవరం: మట్టి అక్రమ దందా అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర్నుంచి ఏలేరు కాలువ గట్టు మట్టిని యథేచ్ఛగా తవ్వకాలు జరిపి తరలించుకుపోతున్నారు. విశాఖ స్టీల్ ప్లాంటుకు నీరు తరలించేందుకు ఏలేశ్వరం రిజర్వాయరు నుంచి నాతవరం మండలం మీదుగా కాలువ ఏర్పాటు చేశారు. జిల్లేడుపూడి గ్రామం వద్ద ఏలేరు కాలువకు సుమారుగా 280 అడుగుల లోతులో 3 కిలోమీటర్ల పొడవునా సొరంగం మార్గం ఏర్పాటు చేశారు. సొరంగం తవ్వకాలు చేసే సమయంలో లోపల నుంచి వచ్చిన దానిని కాలువకు ఇరువైపులా సుమారుగా 60 నుంచి 80 అడుగుల ఎత్తులో మట్టి దిమ్మలు వేశారు. సొరంగం తవ్వకాల ద్వారా వచ్చిన మట్టి మరింత నాణ్యత కావడంతో ఈ ప్రాంతంలో ఊహించని గిరాకీ నెలకొంది. ఇటువంటి మట్టి నాతవరం మండలం జిల్లేడుపూడి, చెర్లోపాలెం, లక్ష్మీపురం, వెంకయ్యపాలెం, గోవిందపురం ప్రాంతాల్లో ఏలేరు కాలువకు ఇరువైపులా లక్షల టన్నుల్లో ఉంది. దీనిపై కూటమి నేతలు కన్నుపడడంతో యథేచ్ఛగా తవ్వకాలు చేసి తరలిస్తున్నారు. రాత్రి సమయంలో పొక్లెయిన్‌తో టిప్పర్లు, ట్రాక్టర్లతో దర్జాగా లోడు చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లోనే ఏలేరు కాలువ ఒడ్డున ఉన్న మట్టికి మంచి డిమాండ్ ఉంది. దీంతో కొందరు కూటమి నేతలు ఇదే అదునుగా అక్రమ దందా మొదలు పెట్టారు. నాతవరం మండలంలో టిప్పరు ఒక్కంటికి రూ.15 వేలు, ట్రాక్టర్‌కు రూ.2 వేలకు విక్రయిస్తున్నారు. నర్సీపట్నం మండలం ఇతర ప్రాంతాలకు అయితే దూరాన్ని బట్టి ధర నిర్ణయిస్తున్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో ఇక్కడ గ్రావెల్ వినియోగానికి ఆసక్తి చూపిస్తున్నారు. రాత్రి వేళల్లో పొక్లెయిన్‌తో తవ్వకాలు చేపట్టి, టిప్పర్లు, ట్రాక్టర్లకు లోడు చేసి తరలిస్తూ.. ఉదయానికి ఇక్కడ వాహనాలు లేకుండా జాగ్రత్త పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏలేరు కాలువ గట్టు మట్టి తవ్వకాలు చేయకూడదు. అయినా అధికారం అండతో కూటమి నేతలు అధికారులను మచ్చిక చేసుకుని విచ్చలవిడిగా తవ్వకాలు చేసి వ్యాపారం చేస్తున్నారు. 2020లో అక్రమంగా ఏలేరు కాలువ గట్టు మట్టి తరలిస్తుండగా అప్పటి నర్సీపట్నం ఏఎస్పీ రిశాంత్‌రెడ్డి పట్టుకుని కేసు నమోదు చేసి హెచ్చరికలు జారీ చేశారు. దీంతో చాలా కాలం పాటు ఎలాంటి తవ్వకాలు జరగలేదు. కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ అక్రమ తవ్వకాలు జోరందుకున్నాయి. ఈ దందా విషయాన్ని కొందరు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కూటమి నేతలకు భయపడి అటువైపు కనీసం కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గట్టుపై తవ్వకాలు చేసి మట్టి తరలిస్తే ఏలేరు కాలువ సొరంగానికి ప్రమాదం పొంచి ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయంపై ఏలేరు కాలువ జేఈ గోపీనాథ్‌ను వివరణ కోరగా.. రాత్రి సమయంలో మట్టి తరలిస్తున్న వారిపై నైట్ డ్యూటీ సిబ్బందిని నియమించి నిఘా పెడతామన్నారు. ఏలేరు కాలువ గట్టు మట్టిని తవ్వకాలు చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.



ఉన్నతాధికారులు దృష్టి సారించాలి..

ఈ ప్రాంతంలో అధికంగా మట్టి ఉంటే టెండర్లు పిలిచి విక్రయిస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఆ దిశగా అధికారులు దృష్టి సారిస్తే అక్రమ వ్యాపారం నివారించవచ్చు. కూటమి నేతల ఒత్తిళ్లకు భయపడి అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్నట్లుగా ఉంది. – ఎ.చిన్నయ్యనాయుడు, సీపీఐ మండల కార్యదర్శి

ముగిసిన వెంకన్న కల్యాణోత్సవాలు



ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి 15వ వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా ముగిశాయి. గత నెల 31న స్వామి వారి పెళ్లి రాట వేశారు. ఈ నెల 6న స్వామి వారి కల్యాణం జరిపారు. నాగవల్లి సంబరాలలో భాగంగా బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు అనంతరం స్వామి వారి ఊంజల్ సేవ, దర్పణ దర్శనంతో ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో నిత్య దూప దీప నైవేద్యాల కోసం ప్రతి నెలా రూ.6 వేలు చొప్పున అందిస్తున్న దాతలు, ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న వారికి, భజన బృందాల సభ్యులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించి, స్వామి వారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చైర్మన్ రాపేట రామకొండలరావు, ఉత్సవ కమిటీ కన్వీనర్ కాళ్ల అప్పలనాయుడు, కో-కన్వీనర్ పుట్టా బలరామ్, సర్పంచ్ జామి రమణబాబు, ఉప సర్పంచ్ సూరిశెట్టి గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు ఇవ్వండి మహాప్రభో!



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గిరిజన మహిళలు

రావికమతం: రక్షిత పథకం ట్యాంక్ నిర్మాణం పూర్తి చేసి, తాగునీటి సదుపాయం కల్పించాలని పాత కొట్నాబిల్లిలో గిరిజన మహిళలు గురువారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. పాత కొట్నాబిల్లి గిరిజన గ్రామంలో 300 మంది జనాభా నివసిస్తున్నారు. జల్ జీవన్ మిషన్ పథకం కింద రూ 16.90 లక్షలతో ఇంటింటా కుళాయిల ద్వారా తాగునీరు అందించే చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి మధ్య వదిలేశారు. తక్షణమే ఈ ట్యాంక్ పనులు పూర్తి చేసి ఇంటింటికి నీరు ఇవ్వాలని గిరిజనలు గురువారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. లేకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు, గిరిజనలు హెచ్చరించారు.

'మధ్యాహ్న భోజనం'లో సన్న బియ్యం వాడాలి



సూర్రెడ్డిపాలెంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో ప్రసాద్

కె.కోటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నబియ్యంను తప్పనిసరిగా తయారీదారులు వాడాలని ఎంఈవో డీవీడీ ప్రసాద్ సూచించారు. మండలంలోని సూర్రెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిచెన్ షెడ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను పెంచాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించేందుకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు పాఠశాలలకు ఇప్పటికే పంపించినట్లు ఎంఈవో తెలిపారు.

పంట పొలాల ముంపు సమస్యకు పరిష్కారం

పూడ్చిన మదుం స్థానంలో నూతన తూము ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



కాలువకు ఆనుకుని కొత్త తూము ఏర్పాటు చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

దేవరాపల్లి: దేవరాపల్లిలో పంట పొలాల నీటి ముంపు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో రైవాడ జలాశయం నుంచి విశాఖ నగర పాలక సంస్థకు తాగునీటిని సరఫరా చేసే కాలువకు ఆనుకుని ఉన్న సుమారు 5 ఎకరాలల్లో సాగు చేసిన కాయగూరలు, నువ్వు, తదితర పంటలు నీటి మునిగిన సంగతి తెలిసిందే. రైవాడ జలాశయం నుంచి నగరపాలక సంస్థకు మంచినీటి సరఫరా చేసే కాలువ మరమ్మతుల పేరిట 0.350 కిలోమీటరు వద్ద తూముని మూసివేశారు. దీంతో పొలాల్లో చేరిన అదనపు నీరు బయటకు వెళ్లే దారి లేక ఎడమ కాలువ గట్టు వైపు పొలాలు మునిగిపోయి, పంట నష్టం వాటిల్లింది. ఈ సమస్యపై ఈ నెల 7న నీట మునిగిన పంట పొలాలు శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. పూడ్చిన మదుంను తెరిచి పాత తూము స్థానంలో కొత్త తూము(5 అంగుళాలు)ను అమర్చి యథావిధిగా పొలాల్లో చేరే అదనపు నీరు పోయే మార్గాన్ని పునరుద్ధరించినట్లు జీవీఎంసీ ఏఈఈ మోహన్, సూపర్‌వైజర్ పోలినాయుడు గురువారం తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేసిన 'సాక్షి'కి స్థానిక రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

బాలికల వసతి గృహంలో ప్రవేశాలకు ఆహ్వానం

మాడుగుల: స్థానిక టైప్-4 కస్తూర్బా వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఈవోలు ఎం.పాండురంగారావు, బి.దేముడమ్మ తెలిపారు. 9, 10, ఇంటర్ చదివే విద్యార్థులకు టైప్-4 వసతి గృహంలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. అనాథలు, సెమీ అర్ఫన్, రిజర్వేషన్ ప్రకారం సీట్ల భర్తీ చేస్తామన్నారు. ఇంకా సీట్లు మిగిలితే నియోజకవర్గం ప్రామాణికంగా తీసుకుని భర్తీ చేస్తామన్నారు.

రేపు 14 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాకవరపాలెం: రెండు ఫీడర్ల పరిధిలో శనివారం 14 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని విద్యుత్ శాఖ నర్సీపట్నం ఈఈ అప్పారావు గురువారం తెలిపారు. వెంకన్నపాలెం సమీపంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరాకు అంతరాయం లేకుండా చెట్ల కొమ్మలు తొలగించనున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో భీమబోయినపాలెం, రామన్నపాలెం ఫీడర్ల పరిధిలోని రాజుపేట, శెట్టిపాలెం, చింతలూరు, వెంకన్నపాలెం, జడ్.గంగవరం, వెంకయ్యపాలెం, చిన రాచపల్లి, ధర్మవరం, దుంగలవానిపాలెం, గండిపేట, యరకన్నపాలెం, జి.వెంకటాపురం గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

ఐదు గ్రామాల్లో అంతరాయం నేడు

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడ సబ్‌స్టేషన్ పరిధిలో ఎం.అలమండ ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు స్థానిక ఎలక్ట్రికల్ ఏఈఈ కె.శంకరరావు తెలిపారు. లైన్ మెయింటెనెన్స్ పనులు నిమిత్తం ఎం.అలమండ, ఎ.కొత్తపల్లి, ముషిడిపల్లి, కె.ఎం.పాలెం, ఎండపల్లిపాలెం గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.


యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



కొడవటిపూడిలో సాగు పద్ధతులను వివరిస్తున్న శాస్త్రవేత్త శ్రీధర్

కోటవురట్ల: సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధ్యమని జాతీయ మత్స్య పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త యు.శ్రీధర్ తెలిపారు. మండలంలోని కొడవటిపూడి గ్రామంలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. శాస్త్రవేత్త శ్రీధర్ మాట్లాడుతూ వరిలో అధిక దిగుబడుల కోసం వ్యవసాయ శాఖ సూచనలు తీసుకోవాలన్నారు. డ్రోన్ ద్వారా రసాయనాల పిచికారీ సులభమని, తద్వారా ఖర్చు, సమయం ఆదా అవుతాయన్నారు. సమగ్ర కలుపు యాజమాన్య పద్ధతులను పాటించడం వల్ల కూలీల కొరతను అధిగమించవచ్చని తెలిపారు.

ఘనంగా అప్పికొండమ్మ పండగ



అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

గొలుగొండ: ఏఎల్‌పురం పరిసర ప్రాంతాల ఇలవేల్పు అప్పికొండమ్మ పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. ఏఎల్‌పురం, కొంకసింగి, నాగాపురంతో పాటు అల్లూరి జిల్లా కొయ్యూరు, చింతపల్లి మండలాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి కానుకులు సమర్పించుకొని మొక్కలు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు, కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వర్రావు ఏర్పాట్లు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రణాళిక

గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరి



చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరి, తదితరులు

నాతవరం: అంగన్‌వాడీ కేంద్రాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరీ తెలిపారు. నాతవరం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత మార్పులకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను అన్ని విధాలుగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వ అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందేలా దృష్టి సారించామన్నారు. మండల వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, నేతల విజయకుమార్, ఐసీడీఎస్ నాతవరం, వై.డి.పేట సెక్టారు సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నాగజ్యోతి, పంచాయతీ కార్యదర్శి లాలం శేషు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి

నర్సీపట్నం: వచ్చేనెల 9న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన కమిటీ జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీల 42 రోజుల సమ్మెకాలంలో ప్రభుత్వం చేసిన ఒప్పందాలు ప్రకారం వేతనాల పెంపు, ఉద్యోగ విరమణ, మినీ టీచర్ల ప్రమోషన్లు అమలు చేయాలన్నారు. రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. పేదలకు ఉపయోగ పడే ఐసీడీఎస్‌కు తగిన నిధులు కేటాయింపు చేయాలన్నారు. ఈ సమస్యలపై జరుగుతున్న సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్.రమణమ్మ, సిహెచ్.భ్రమరాంబ, మంగ, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, కృష్ణవేణి, సామ్రాజ్యం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం



సూదివలసలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శశి ప్రియాంక

కె.కోటపాడు : ప్రస్తుతం వర్షాలు పడుతున్న దృష్ట్యా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శశి ప్రియాంక సూచించారు. సంచార చికిత్స వైద్య సేవల్లో భాగంగా సూదివలసలో గురువారం ఆమె 137 మందికి సాధారణ వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు జరిపారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ విజయ, హెచ్‌వీ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం అనురాధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసాలు



జి.అగ్రహారం ఎంపీపీ పాఠశాలలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్‌ఎం బంగారయ్య

మాడుగుల రూరల్: వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం కె.బంగారయ్య ఆధ్వర్యంలో సుమారు 12 మందికి ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించారు. వారితో అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, నర్మదా, అంగన్‌వాడీ కార్యకర్తలు కాసులమ్మ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అందని యూనిఫాం.. పుస్తకాల కోత

- కొత్త విద్యా సంవత్సరంలో పాఠశాలలు పునః ప్రారంభం
- తొలి రోజు విద్యార్థుల హాజరు అంతంత మాత్రమే



బుచ్చెయ్యపేటలో మధ్యాహ్న భోజన తయారీ పాత్రలు శుభ్రం చేస్తున్న సిబ్బంది

నర్సీపట్నం: కూటమి ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమైంది. పాఠశాలలు ప్రారంభమైన రోజే అన్నీ అందిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం ఏమి ఇవ్వలేకపోయింది. వేసవి సెలవులు అనంతరం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు గురువారం తెరుచుకున్నాయి. ఎన్నో ఆశలతో పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులకు నిరాశ ఎదురైంది. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలు తెరుచుకునే నాటికే పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు, యూనిఫాం, షూలు, బెల్టు, బ్యాగ్‌లు అందేవి. ఈ ఏడాది తొలి రోజు ఏమి అందలేదు. పాఠ్య పుస్తకాలు , నోట్ పుస్తకాలు మండల కేంద్రానికి చేరాయి. ఇప్పుడు ఇప్పుడే పాఠశాలలకు చేరుకుంటున్నాయి. అయితే ఆరో తరగతి విద్యార్థులకు సరిపడా పాఠ్య పుస్తకాలు రాలేదు. యూనిఫాం ఊసేలేదు. బ్యాగ్‌లు, బెల్టు, బూట్లు రాలేదు. వస్తాయో రావో తెలియని పరిస్థితి. ఇవిమేమి అందకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు నిరాశ చెందారు. వారం రోజుల్లో వస్తాయని ఉపాధ్యాయులు బదులిస్తున్నారు. గతేడాది మండలంలో 50 పాఠశాలల్లో 19 వేల మంది విద్యార్థులు ఉండగా, ఈ ఏడాది 17 వేలుకు పడిపోయింది.

సర్కారు బడులు పునః ప్రారంభం

మాడుగుల: సర్కారు బడులు గురువారం పునః ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రవేశాల సందడి అంతగా ఎక్కడా కనిపించ లేదు. పలు చోట్ల పుస్తకాలు పంపిణీ చేశారు. ఇంకా షూ, సాక్సులు, బ్యాగ్‌లు రావాలి. యూనిఫాం కూడా అందజేయలేదు. ఎం.కోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తొలిరోజు ఒక్కరే కొత్తగా జాయిన్ అయ్యారు.

చోడవరం/బుచ్చెయ్యపేట: వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు తెరుచుకున్నాయి. చోడవరం నియోజకవర్గంలో ఉన్న బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట, చోడవరంలో మొత్తం 245 పాఠశాలలు ఉన్నాయి. నియోజకవర్గంలో ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో 16 వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. నాలుగు మండలాల్లో తొలిరోజు 9,300 మంది వరకు విద్యార్థులు హాజరయ్యారు. తొలిరోజు పాఠశాల గదులు, బెంచీలు, కుర్చీలు, పరిసరాలు శుభ్రం చేయడానికి ఎక్కువ సమయం పట్టింది. ఉపాధ్యాయులు బదిలీల కౌన్సెలింగ్ హడావిడిలో ఉన్నారు. పాఠశాలలు తెరిచినా ఇంకా స్కూల్ బ్యాగులు, బూట్లు మండలాలికి చేరలేదు. నోట్ పుస్తకాలు, టెక్స్ బుక్స్, డిక్షనరీలు, బెల్టులు ఎక్కడా పంపిణీ చేయలేదు. మరోవైపు తల్లికి వందనం డబ్బులు జమ చేయకుండా రేపు, మాపూ అంటూ ఊరిస్తుండడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

'అభయ హస్తం' పింఛన్లు అందించాలి



ఆనందపురం సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి ముత్యాలనాయుడు

కె.కోటపాడు : వెలుగు పథకం కింద అభయ హస్తం పింఛన్ కోసం డబ్బులు చెల్లించిన 60 ఏళ్ల పైబడిన వారికి పింఛన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు డిమాండ్ చేశారు. ఆనందపురం గ్రామంలో గురువారం వారాడ, ఆర్.వై.అగ్రహారం, వి.సంతపాలెం, యడ్లవానిపాలెం గ్రామాల్లో సమస్యలపై పార్టీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత గ్యాస్ పథకం ఉందని ఆశతో నగదు కట్టి గ్యాస్ బండ విడిపించుకుంటున్నా బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదన్నారు. వారాడ చాకలి వీధిలో వర్షపు నీరు వెళ్లేందుకు అవకాశం లేక ఎక్కడికక్కడ నిలిచిపోతోందన్నారు. ఆయా గ్రామాల్లోని సమస్యలపై పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రం అందించనున్నామన్నారు. తక్షణం సమస్యలకు పరిష్కారం చూపాలని ముత్యాలనాయుడు కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఈర్లె నాయుడుబాబు, యర్రా దేముడు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాల కోసం పేర్ల నమోదు

రోలుగుంట: ఖరీఫ్ సీజన్‌లో భాగంగా రాయితీపై వరి విత్తనాల కోసం వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం నుంచి రైతుల వివరాలు నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని వ్యవసాయ విస్తరణాధికారి ఉష తెలిపారు. వరి విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్, పాస్ బుక్ జెరాక్స్ కాపీలతో వచ్చి నగదు చెల్లించి వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.